● జి.కొండూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పరంజ్యోతి మానవ సేవా సమితి ప్రతినిధులు దుర్గ, వెంకటేశ్వరరావు అన్నారు. భగవతి పద్మావతి అమ్మ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం మొక్కలు పంపిణీ చేశారు.













సమన్వయంతో అభివృద్ధి

ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విస్సన్నపేట: అందరి సమన్వయంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుపుదామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా మండలంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.5 కోట్లు మంజూరయ్యాయని, వాటితో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. విస్సన్నపేటలో ముస్లింలకు, క్రైస్తవులకు శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాఫర్ బాబా ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. శ్మశాన వాటిక ఏర్పాటు పనులు 100 రోజుల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పుట్రేల గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో నీరు నిల్వ ఉంటోందని, గ్రామంలో డ్రెయినేజీల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్ స్వాతి తీసుకు వెళ్లారు. గ్రామాన్ని సందర్శించి అవసరమైన చోట డ్రెయినేజీల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని, పక్కన ఉన్న వేరే కార్యాయంలో మండల పరిషత్ కార్యాలయం నడుస్తోందని, నూతన కార్యాలయం మంజూరు చేయాలని ఎంపీపీ మెర్సీవనజాక్షి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

ఆగిరిపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్లో భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ నిర్వాహకులు పాలడుగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు నాలుగు మండపాల చుట్టూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్, ఇండియన్ ఆయిల్ సీనియర్ సేల్స్ మేనేజర్ సువిధ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందాలన్నారు. బీజేపీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు, ఏఎస్ఐ తావిరియా నాయక్, ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● భవానీపురం(విజయవాడపశ్చిమ): హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం గొల్లపూడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.


జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని తహసీల్దార్ వై. వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో జెడ్పీ బాలికల ప్రతిభ

నూజివీడు: బాల కార్మిక వ్యవస్థపై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని వీణా రాణి బుధవారం తెలిపారు. వ్యాస రచన పోటీల్లో పదో తరగతి విద్యార్థిని ఎస్.కవిత జిల్లాలో ప్రథమస్థానంలో, వక్తృత్వ పోటీల్లో సీహెచ్ నిఖిల ద్వితీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. వీరు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఏలూరులో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వార్డుల్లో పారిశుద్ధ్య పనులు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని పలు వార్డుల్లో నగర పంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బుధవారం వార్డుల్లో మురుగుకాల్వలను శుభ్రం చేసిన పారిశుద్ధ్య సిబ్బంది వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. ఇళ్ల పరిసరాల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. 15వ వార్డులో పారిశుద్ధ్య పనులను వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ పర్యవేక్షించారు.

● చాట్రాయి: మండలంలోని కొత్తగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రెయినేజీల్లో పూడిక తీత, మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లించారు. సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

మైలవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరంలోని వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మండపంలో గురిజా లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కోడూరు మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మైలవరం లయన్స్ క్లబ్ అనుబంధంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పలువురు యువకులు రక్తదానం చేశారు.

సంక్షిప్తంగా...

● ఎంపీడీఓ అనూరాధకు అభినందన

జి.కొండూరు: జి.కొండూరు ఎంపీడీఓగా తిరిగి బాధ్యతలు చేపట్టిన పి. అనూరాధను మండల వ్యవసాయాధికారి రాంకుమార్, ఆ శాఖ సిబ్బందితో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

చాట్రాయి: చాట్రాయి ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను మండల పరిషత్ ఏఓ మురళీ మోహనరావు, సిబ్బంది అభినందించారు.

● మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలి

ఇబ్రహీంపట్నం: మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని బాలభవన్ పోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం చర్చిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసలుగా మారిన వారిని గుర్తించి కౌన్సెలింగ్, డి అడిక్షన్ సెంటర్లకు పంపించాలని పాస్టర్లను కోరారు. జోనల్ కో–ఆర్డినేటర్ ప్రియాంక, విజయరాణి, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● నేడు మాంసం విక్రయాలు బంద్

మైలవరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మైలవరం పట్టణంలోని చికెన్, మటన్ షాపులు, బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లలో మాంసం విక్రయాలకు అనుమతి లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ రఫీ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

● రేపు నేత్ర వైద్య శిబిరం

తిరువూరు: ప్రత్యేక నేత్ర వైద్య శిబిరం స్థానిక బాపూజీ పెన్షనర్స్ హోంలో శుక్రవారం ఏర్పాటు చేశామని ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరువూరు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు బీవీ ప్రసాదరావు, మార్కు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. వివరాలకు సెల్: 91330 00748 నంబరును సంప్రదించాలన్నారు.

కుమ్మరికుంట్లలో వైద్యశిబిరం

ఎ.కొండూరు: కుమ్మరికుంట్ల గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో జ్వరాలపై సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీకృష్ణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నూజివీడు: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కన్వీనర్ కుందేటి జయరాజు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2016 దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలని, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్షుడు ఎస్.సుబ్బయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు, నీలపాల నాగరాజు పాల్గొన్నారు.

● పంటల నమోదు తప్పనిసరి

ఎ.కొండూరు: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి టిప్పుసుల్తాన్ అన్నారు. పోలిశెట్టిపాడు గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. సెప్టెంబర్ 15 నాటికి రైతులు వేసిన పంటను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

● విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరువూరు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సుందరయ్య భవన్‌లో నిర్వహించిన పోటీలలో 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మీకు నచ్చిన స్వాతంత్ర్య సమరయోధుడి చిత్రం అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి.

● విద్యార్థులకు క్రీడా పోటీలు

గానుగపాడు(తిరువూరురూరల్): గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, రన్నింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించామని ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి తెలిపారు. ఆటలు, పాటల పోటీలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించామని, విజేతలకు గురువారం బహుమతి ప్రదానం చేస్తామని చెప్పారు.

● ఘనంగా ఫ్రెషర్స్ డే

నూజివీడు: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని శారద విద్యా సంస్థల చైర్మన్ కుప్పాల శంకరరావు అన్నారు. పట్టణంలోని శ్రీ శారద జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● మెషిన్ లెర్నింగ్‌తో ఉపాధి అవకాశాలు

నూజివీడు: మెషిన్ లెర్నింగ్ నిపుణుల అవసరం వేగంగా పెరుగుతోందని, వీరికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో ఈసీఈ విభాగంలో మెషిన్ లెర్నింగ్‌పై మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను బుధవారం డైరెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఈసీఈ విభాగాధిపతి పి. శ్యామ్ మాట్లాడుతూ సంబంధిత రంగాల్లో నైపుణ్యం పొందడానికి శిక్షణ ఇవ్వడం, మెషిన్ లెర్నింగ్ నేర్చుకోవడం ద్వారా ప్లేస్‌మెంట్‌లను పెంచడం వంటి వాటికి అధిక ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. డీన్ అకడమిక్స్ ఎస్.రత్నాకర్, అన్ని ఇంజినీరింగ్ బ్రాంచీల హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రేపు అన్న క్యాంటీన్ ప్రారంభం

నూజివీడు: పట్టణంలోని రామాయమ్మరావుపేటలో ఈ నెల 16న అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ క్యాంటీన్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. పూటకు 350 మందికి చొప్పున ఈ సదుపాయం ఉంటుందని చెప్పారు.

● దివ్యాంగుల స్థల కబ్జాను అడ్డుకోండి

ఇబ్రహీంపట్నం: దివ్యాంగుల సేవా సంస్థకు గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుని కోరారు. 25 మంది సభ్యుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం తహసీల్దార్‌కు వారు అందజేశారు. అసోసియేషన్ సభ్యురాలు షేక్ నగీనా, సభ్యులు పాల్గొన్నారు.

● 20 నుంచి నిరుద్యోగులకు శిక్షణ

తిరువూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి తిరువూరులో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇస్తామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ సేల్స్ మెన్, డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఆపరేటర్ కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు సెల్: 63015 34435, 95533 15667 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

● సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు మేలు

జి.కొండూరు: సాగుదారుని హక్కు పత్రం (సీసీఆర్‌సీ) కార్డులను పొందడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను కౌలు రైతులు నేరుగా అందుకోవచ్చని మండల ప్రత్యేకాధికారి జి. మోహన్‌బాబు తెలిపారు. ఆత్కూరు గ్రామంలో పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్, ఎంపీడీఓ అనూరాధ, సర్పంచ్ పోతురాజు జయనాగవీణ, అధికారులు పాల్గొన్నారు.

● గురుకులంలో జంగిల్ క్లియరెన్స్

ముసునూరు: ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యాలయం ఆవరణలో బుధవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. డీఈఓ ఎస్.అబ్రహాం మంగళవారం సాయంత్రం గురుకులంలో విచారణ నిర్వహించి పాఠశాల ప్రాంగణం, పరిసరాలను పరిశీలించి జంగిల్ క్లియరెన్స్ చేయించాలని ఆదేశించారు. దీనిపై ప్రిన్సిపాల్ ప్రవీణ స్పందించారు. తాజా కూరగాయలు రప్పించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

● చాట్రాయి: తుమ్మగూడెంలో బుధవారం పాల ఉత్పత్తిదారులకు మొదటి విడత బోనస్ రూ.3.46 లక్షలను పంపిణీ చేశారు. తిరువూరు పాల కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి, పాల సంఘం అధ్యక్షురాలు పద్మావతి పాల్గొన్నారు.













